# ★ కోడలు తెచ్చిన ఘనత ★

రచన: "రామ్ శ్రీ"

వెంకటేశ్వర్రావు మరణానికి ఆ యింటిల్లిపాదీ ఎంతో ఏడ్చారు. "ఏమీలేనివాణ్ని వేరేకాపురం పెట్టించి నేనే వాడిప్రాణాలు తీశాను. నన్నేం చేసినా పాపంలేదు" అని వాపోతున్న మామగార్ని చూచి కోడలు కొంతం ధైర్యం తెచ్చుకొని అంది.

"ఇందులో ఎవర్నీ అనవలసిన పనిలేదు. మా ఖర్మ...ఉద్యోగం లేనినాళ్ళు రాలేదనేడ్చాం...తీరా అది వచ్చేసరికి మరణాని కంకితమయ్యారు—అది మా కర్మకాక మరేవిటి?...మీరిలా విచారించకండి" యీ మాటలన్నతంతో అందరూ ఆశ్చర్యమయింది—మామగారికీమాటలు శూలాల్లాగ గ్రుచ్చుకున్నయ్.

'నీవు చెప్పినది నిజమేనమ్మాయ్' అనగల్గాడు శివయ్యగారు. కావమ్మగా రందుకొని... 'జరగాల్సిన పనులేమో జరిగిపోయాయి. అమ్మాయి కొంతం...యిహ నుంచి మాయింట్లో నుండిపో" అంది దానికి కోడలు అంగీకరించలేదు.

*　　　　*　　　　*

కోడలు కొంతం అంగీకరించక పోవడంలో ఏదో రహస్యముందని అనుమానపడ్డారు—ఏధైర్యంతో తను ఒకర్తి ఏలా వుంటుంది?...

ఎవరేం అనుమానపడ్డా ఎన్ని అనుకొన్నా తనేం ధైర్యంతో అందో — ఆ ధైర్యంతోనే కాలం గడప సాగింది.

నారాయణకు నాలుగేండ్లు దాటాయి. వాణ్ని ఏలాగో బడిలో వేయాలి...వాడు యింతచదివి సంపాయించపెట్టలేక పోయడా?

కొంతం-యీపసేమన్న బాగుందా? నీవే చెప్పా మీ మామగారు ఎంత బాధపడ్తున్నారో చూడు తల్లీ మా మాటవిని మా యింట్లోనే వుండమ్మా" అంది ఎంతో అప్యాయంగా అత్తగారు.

అత్తవారిమాటలు తోసేసినా, ఆవిడతో కొంచెం జాగ్రతగానే మాట్లాడింది. మొదట్నుంచి ఆవిడ తన మామగారే-సంపాయించింది చాలక నయితే నేమి?... వేరే పెట్టించినట్లు ప్రపంచాన్నుండీ వేలుచేసేశారు—

"ఎందుకులెండి అత్తగారు. ఎదో యిలా గడుపుతూంటాం" అనగల్గినా అత్తగారూరుకోక బ్రతిమాలింది. అప్పుడు ఆవిడను భంగపరచడం యిష్టంలేక— ఒప్పుకుంది. కాని తనుచేసే పనికెవరూ అడ్డు రారు గదా!" అనే ఆలోచనలో మునిగినా అది అట్టే నిలువ లేక పోయింది.

'కొంతం' అంటూ మామగారు పిల్చాడు. ఉదయం తొమ్మిదిగంటలయింది. పిలుపుకో జవాబు లేదు. గట్టిగాపిల్చి-భార్యను పిల్చాడు.

'ఏమిటండి!...' సనుగుతూవస్తున్న భార్యను చూచి ఆయన మండిపడ్డాడు: 'కోడలు ఎక్కడ'—

'ఏమో' పదేపదే అదే జవాబిచ్చేసరికి యిలా కాదనుకొని తగ్గి అడిగాడు — కోడలు ఎక్కడికి పోయింది? అని.

'తెలియదండి—ఏం జేస్తున్నదో కూడా తెలియదు. స్నేహితురాండ్ర యిండ్లకు పోయున్నానని అంటోంది—అంతే అయివుంటుంది. యింట్లో వుండి ఈ చిన్నతనంలో సంభవించిన యీ విపత్తు తలంచుకొని ఏడ్వడమేగదా! అలా హాయిగా పోయివుంటుంది" యిష్టమేనన్నట్లు మాట్లాడేసరికి భర్త మళ్లీ అన్నాడు.

"గడప గడపా దిరిగివస్తే మన పరువేమన్నా నిలవాలా? అదేమీ మంచిపనికాదూ! అయినా రోజల్ల గడుపుతోందా?"

'లేదు-నాలుగయిదు గంటలు—'

'అదికాదు-యీలా కోడలుపిల్ల తిరిగితే లోకులు ఏమనుకుంటున్నారో తెలుసుకో!'

'వారేమనుకుంటే మనకేమండి. ఆలా అనుకుంటున్నారనే యింతపని చేశారు' అనేసరికి ఆయన మాట్లాడలేక పోయాడు. కొడుకు జ్ఞాపకం వచ్చాడు. తన్ను ఉద్యోగం చూచికొమ్మని బలవంతాన పంపాను. అదిలేక దిగులుపడి ఎంతో కష్టపడాడు. వేళకు నీరు తిండిలేక నీరసించి చనిపోయాడు. అవును, కొత్తకాపురం పెట్టే బాధపడుతారేమోననుకున్నా; గాని యీలా సంసారం విచ్ఛిన్నం అవుతుందనుకోలేదు'' అని ఎంతో దిగులుగా అన్నాడు.

భార్య ఏమీ మాట్లాడలేక వెళ్ళిపోయింది. అవును కోడలుపిల్ల ఏంజేస్తోంది అన్న భర్తమాటలు జ్ఞాపకంవచ్చి ఏవో అనుకుంటూ వెళ్ళింది.

'ఏవమ్మా! చూచావా! కాంతం వారికోడలు ఏం చేస్తోందిట!'' అంది ఓ లోలాక్షి ప్రక్కనున్న హరిణాక్షితో.

'ఏమోనమ్మా!' అంటూ 'భర్త పోయాడుగదా! యింట్లో కూర్చోక అవేం దిరుగుళ్లమ్మా!' అంది యింకో మీనాక్షి లోలాక్షి, హరిణాక్షులతో.

ఈ మాటలు కాంతం అత్తగారువింది. ఏమనడానికి తోచలేకపోయింది. 'ఊళ్ళో ముచ్చట్లు మీకే కావాలి. ఎవరెలాపోతే మీకేం? అది మీలాగా వెధవ పనులేమీ చేయడంలే' అంది మీనాక్షితో.

తాత్కాలికంగా వాళ్ళమీద విసురుకుపడ్డా అవి మాటలకు వారందరు ఏమీ మాట్లాడలేక తగ్గి వెళ్ళిపోయారు. యీవిడ ఏవో అనుకొంటూ యింటికివచ్చింది. అక్కడ జరిగినవన్నీ భర్తతో పూసగ్రుచ్చినట్లు చెప్పేసింది. ఈ రోజు తేల్చుకోవలసిందే ఏంజేస్తుందోనని' అనుకున్నా రిద్దరూ.

'కాంతం ఎంతవరకు చదువుకొంది' అంది భర్తతో.

'ఎనిమిదవతరగతో, ఏవో గవర్నమెంటు పరీక్షకు పోయినట్లుంది. ఎంతలే' అన్నట్లు మాట్లాడేసరికి అనుకొన్న ఆలోచన పటాపంచ లయిపోయింది. మరేం చేస్తోంది?

ఇంతలో కాంతం రానేవచ్చింది.

'కాంతం' గట్టికేకతో ఉలిక్కిపడి ''ఏమిటండత్తగారు' అంది నీళ్లుగ మ్రింగుతూ.

'ఎక్కడికెళ్ళావ్!' గద్దించి అడిగింది.

'ఎక్కడికి వెళ్లలేదు' చూచాయగా జవాబిచ్చింది.

'లోకు లేమనుకుంటున్నారో విన్నావా?' అంది.

'ఎవరేమనుకున్నా నాకేం భయంలేదు. నేను చేసేపని తప్పు లేకపోయినపుడు ఎవరనుకున్నా, ఏమనుకున్నా నష్టంలేదు. లోకులు కాకులు'' అంది. అత్తగారు నిలువదీసేసరికి యిక ఉండబట్టలేక 'నా యిష్టం' అంది నివ్వెరపోయా రాముసలిదంపతులు. టైపు నేర్చుకొంటున్నాననీ ఎవరుతో చెప్పలేదు, చెప్పేనవసరం కలుగలేదు. కాని అదేమైనా గొప్పపనా? వూరుకుంది.

కాంతం మామగారు యింట్లోనే ఉండిపోయారు. యింతలో పోస్టుమాన్‌వచ్చి ఏదో కవరుయిచ్చి వెళ్ళిపోయాడు. అది తనపేరగాదు - కోడలుపేరు. ఆ... కోడలు కెచ్చట్నుంచి వుత్తరాలు వస్తున్నాయి. ఎన్నాళ్ళనుంచీ ఈ నాటకం. ఆ...రోజూ వస్తున్నాయన్నమాట. నేను యింట్లో లేకపోవడమో-అదేపోయి పోస్టాఫీసుకు తెచ్చుకుంటున్నదో అర్థంకాక తికమక పడ్డాడు.

ఇంతలో భార్యవచ్చి 'ఎక్కడ్నుంచి వుత్తరం' అంటూ అడిగింది.

'కోడలుకు వచ్చింది' కటువుగా అన్నాడు.

'ఏమని' అంది మళ్లీ ఏమంటాడోనని భయం కొద్ది—

'నే చూడలేదు. యీ వెధవవుత్తరాలు నే చదువను. దరిద్రపుపనులు' విసుక్కొంటూంటే, మామూలు కవరుగాదని గ్రహించినదై.

'చింపి చూడండి, ఎక్కడ్నుంచి వచ్చిందో-' అనేసరికి నిజమేనని తోచింది ఆయనకు.

చింపిచూడు-ఆశ్చర్యం కలిగింది. నవ్వువచ్చింది. సంతోషం కల్గింది. ఏమిటో!

'కోడలుపిల్లకు యీ వూళ్ళో ఉద్యోగంవచ్చింది. టైపిస్టుగా వచ్చింది. మొదట్లో 120 రూ. జీతం నెలకు' అని గడగడ చెప్పేశాడు.

కాంతం యిట్లో లేదుగాని వుంటే ఏం 'జేసేవాడో?